‘కూటమి’లో.. ఇసుకాసురులు!

- నియోజకవర్గంలో ఇసుక అక్రమ వ్యాపారం
- ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తున్న వ్యాపారులు
- అనధికార స్టాక్ పాయింట్‌లు.. రవాణా చార్జీల పేరిట దోపిడీ

ప్రభుత్వం ఇసుక ఉచితం అన్నది మాటలకే పరిమితమవుతోంది. రవాణా చార్జీల పేరిట కూటమి నాయకుల అండదండలతో వ్యాపారులు ప్రజలను, నిర్మాణదారులను దారుణంగా దోచుకుంటున్నారు. పెందుర్తి నియోజకవర్గ పరిధిలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేకపోవడంతో ఇక్కడి వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను తీసుకొచ్చి అనధికారిక స్టాక్ పాయింట్ల ద్వారా ప్రజల్ని ముంచుతున్నారు.



చినముషిడివాడలో ఇసుక లారీలు

పెందుర్తి: కూటమి నాయకుల కనుసన్నల్లో ఇసుక దందా యథేచ్ఛగా జరుగుతోంది. తమకు నచ్చిన రీతిలో ధరలు నిర్ణయించి విక్రయాలు జరుపుతున్నారు. దీంతో ఇంటి నిర్మాణం భారమవుతోంది. కొన్నిచోట్ల ఈ అక్రమ రవాణా పోలీసులు, మైనింగ్ అధికారులకు కాసులు కురిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రధానంగా రెవెన్యూ అధికారులకు ఈ ఇసుక అనధికారిక స్టాక్ పాయింట్లు కల్పతరువుగా మారాయనడంలో సందేహం లేదు. ఇక్కడ అంతా అక్రమమని తెలిసినా బాధ్యత వహించాల్సిన ఆ శాఖ అధికారులు ‘మామూళ్ల’గా మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్మాణదారులు బెంబేలు

ప్రస్తుతం పెద్దలారీ దాదాపు 7 యూనిట్ల ఇసుక ధర కనీసం రూ.25 వేలు నుంచి రూ.30 వేలకు విక్రయిస్తున్నారు. ఒక్కోసారి డిమాండ్‌ను బట్టి ఆ ధర మరింత పెరుగుతోంది. వాస్తవానికి శ్రీకాకుళం రీచ్ నుంచి పెందుర్తికి 7 యూనిట్ల లారీ ఇసుక తరలించాలంటే దాదాపు రూ.12 వేలు లోపు రవాణా చార్జీలు పడతాయి. కానీ ఇక్కడకు ఇసుక తరలించి స్టాక్ పాయింట్లలో ఉంచి కృత్రిమ కొరతతో డిమాండ్ సృష్టిస్తున్నారు. ఆ తర్వాత ఇష్టం వచ్చిన ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు.

చోద్యం చూస్తోన్న యంత్రాంగం

పరవాడ తీరం నుంచి సముద్రపు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీన్ని సాధారణ ఇసుకతో కలిపి నిర్మాణదారులకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఈ అక్రమ ఇసుక రవాణాను సక్రమంగా అడ్డుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. ఇసుక వ్యాపారం చేస్తున్న కూటమి నాయకులు తమ అధికార బలం, ఆర్థిక బలంతో అధికారుల నోళ్లు మూయిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.



పురుషోత్తపురంలోని వివాదాస్పద దేవస్థానం స్థలంలో అనధికారిక స్టాక్ పాయింట్

రూ.లక్షల్లో ఇసుక దందా

పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల్లో ఎక్కడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఇసుక రీచ్‌లు లేవు. ఇక్కడ నిర్మాణాలకు సరిపడే ఇసుక లభ్యంకాదు. పెందుర్తి, చినముషిడివాడ, పురుషోత్తపురం, సబ్బవరం, పరవాడ కేంద్రంగా శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన ఇసుకను విక్రయిస్తుంటారు. అయితే ఇక్కడ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డిమాండ్‌ను బట్టి వ్యాపారులు తమకు నచ్చిన ధరను నిర్ణయిస్తారు. చినముషిడివాడ వేదికగా నిత్యం రూ.లక్షల్లో అక్రమ ఇసుక వ్యాపారం జరుగుతోంది.



పెందుర్తి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక

కఠినంగా వ్యవహరిస్తాం

పెందుర్తి ప్రాంతంలో ఇసుక అమ్మకాలపై మాకు ఫిర్యాదులు రాలేదు. అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నట్లు ఆధారాలతో ఫిర్యాదులు చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. అవసరమైన వారు సొంతంగా రవాణా ఏర్పాటు చేసుకుంటే చాలా వరకు ఆదా చేసుకోవచ్చు. అనధికార స్టాక్ పాయింట్లపై ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో మా సిబ్బందిని అప్రమత్తం చేస్తాం.

– ఐ.వెంకట అప్పారావు, తహసీల్దార్ పెందుర్తి

క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు జరిపారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

కిక్ బాక్సింగ్ విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ఎస్‌ఐ దేముడుబాబు

పెందుర్తి: ఇటీవల నగరంలో జరిగిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో పెందుర్తిలోని ఎల్‌-షడ్వాయ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. అక్షయ, మహేశ్వరి స్వర్ణ పతకాలు, ధనకృష్ణప్రియ, తభిత రజత పతకాలు, జయశ్రీ కాంస్య పతకం సాధించారు. అకాడమిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విజేతలను సబ్ ఇన్‌స్పెక్టర్ కనూరి దేముడుబాబు అభినందించారు. అకాడమీ ప్రతినిధులు దాడి శ్రీనివాస్, అంజూరి కరుణాకర్, అర్జున్ పడాల తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ కొనుగోలుకు వితరణ



అంబులెన్స్ కోసం నగదు అందిస్తున్న మళ్ల శ్రీను

పెందుర్తి: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చనున్న ఉచిత అంబులెన్స్ కోసం పెందుర్తికి చెందిన మళ్ల శ్రీను రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పెందుర్తిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు దాడి శ్రీనివాస్, సిరిమళ్ల గణేష్‌కు ఆ నగదు అందించారు. దాతల సహకారంతో అతి త్వరలో ఉచిత అంబులెన్స్ సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీను తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన కౌశిక్ కుమార్

పెందుర్తి: ఇంజినీరింగ్ పూర్తిచేసి స్నేహితులతో కలిసి హాస్టల్లో ఉంటున్న ఓ విద్యార్థి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. చినముషిడివాడకు చెందిన బడిగంటి కౌశిక్ కుమార్(20) నరవలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల బీటెక్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో నరవలోని హాస్టల్లో ఉంటున్న కౌశిక్ ఈ ఏడాది మే 25న ఇంటికి వెళుతున్నానని చెప్పి బయలుదేరాడు. అయితే కౌశిక్ ఇంటికి చేరకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో కౌశిక్ తండ్రి బడిగంటి శ్రీనివాసరావు సోమవారం రాత్రి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ సుమిత్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిప్యూటీ ఎంపీడీవో ధర్మారావుకు సన్మానం



ధర్మారావును సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పరవాడ: స్థానిక మండల పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేసి, పదోన్నతిపై ఏఎస్‌ఆర్ జిల్లా ముంచంగిపుట్ మండల డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టనున్న వి.ధర్మారావును మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. పదోన్నతి పొందడంతో ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు, పరవాడ పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తహసీల్దార్ తనిఖీలు



ఎండీఎంను పరిశీలిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తహసీల్దార్ బి.చిన్నికృష్ణ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాలను పరిశీలించారు. వారితో మాట్లాడి ఆహార పదార్థాల నాణ్యత, వసతుల కల్పన గురించి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలకు ప్రభుత్వం సుమారు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. వార్డెన్ కె.ప్రసాద్, పీఈటీ సూర్యనారాయణ, పీడీ సీఎల్ఎన్ ప్రసాద్, డాక్టర్ కె.కన్నం నాయుడు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

పంచాయతీ నిర్లక్ష్యం.. మరుగుదొడ్లు నిరుపయోగం



తుప్పల మధ్య పరవాడ సామాజిక మరుగుదొడ్లు

పరవాడ: గ్రామీణ ప్రజల సౌకర్యార్థంసింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నిర్వహణ లోపంతో మూలకు చేరాయి. దీంతో ప్రజలు అత్యవసర సమయంలో ఎక్కడికి పోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. 2021లో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.16.50 లక్షలతో పరవాడ గ్రామంలో సామాజిక మరుగు దోడ్లు నిర్మించింది. రెండేళ్ల పాటు వీటి నిర్వహణ సంస్థే చూసుకుంది. ఆ సమయంలో గ్రామీణ ప్రజలతో పాటు ఇక్కడ వారపు సంతకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వినియోగదారులు, రహదారి ప్రయాణికులు దీన్ని వినియోగించేవారు. గతేడాది నుంచి వీటి నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు ఎన్టీపీసీ అప్పగించింది. నిధుల లేమితో అల్లాడుతున్న పంచాయతీ పాలక వర్గం మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేసింది. ఈ మరుగు దొడ్లలో పని చేసే సిబ్బందికి జీతాలు చెల్లించుకోలేక నిరుపయోగంగా మార్చేశారు. దీంతో వీటి చుట్టూ తుప్పలు, డొంకలు పెరిగి అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ప్రజల సౌకర్యార్థం ఎన్టీపీసీ నిధులతో నిర్మించిన వీటిని పంచాయతీ పాలకవర్గం పునర్వినియోగంలోకి తీసుకురావాలి ప్రజలు కోరుతున్నారు. వాడచీపురుపల్లిలో నిర్మించిన సామాజిక మరుగు దొడ్లను పంచాయతీ పాలకవర్గం ఇటీవల ఉపయోగంలోకి తీసుకువచ్చింది. ఇక్కడ కూడా చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్



వి.కనక అప్పారావు, ప్రభుత్వ వైద్యాధికారి, వాడచీపురుపల్లి

సబ్బవరం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్(ఆరోగ్యవంతమైన మహిళ–శక్తివంతమైన కుటుంబం) పేరిట సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళల ఆరోగ్యాన్ని కాపాడి, కుటుంబాన్ని బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా వైద్య సేవలు అందిస్తామన్నారు. మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌లను పరీక్షల ద్వారా నిర్ధారించి, చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణ, గర్భిణీలకు పోషకాహార అవశ్యకత తదితర అంశాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు గుల్లేపల్లి పీహెచ్‌సీలో ఎంపీపీ బోకం సూర్యకుమారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

పరవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వాడచీపురుపల్లి ప్రభుత్వ వైద్యాధికారి వి.కనకఅప్పారావు తెలిపారు. పరవాడ, వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో మహిళ కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. మహిళల ఆరోగ్యాలను కాపాడి కుటుంబాలను బలపరచడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు సమయానుకూల వైద్య సేవలు, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో వైద్య నిపుణులు, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్‌శాఖ, డీఆర్‌డీఏ శాఖల సమన్వయంతో పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారని మండల నోడల్ అధికారి కనకఅప్పారావు తెలిపారు.

ఘనంగా ఓజోన్ దినోత్సవం



ఓజోన్(ఓ3) ఆకృతిలో గురుకుల పాఠశాల విద్యార్థులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఓజోన్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన తదితర అంశాల్లో పోటీలు జరిపారు. ఓజోన్(ఓ3) అక్షరాకృతిలో విద్యార్థులు ఏర్పడి, ఆకట్టుకున్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవి చేతులమీదుగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు డాక్టర్ టి.రాంబాబు, జి.జానకీరాం, హనుమంతు, సింహాచలంలు ఓజోన్ పొరతో మానవాళికి కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. కాలుష్యం వల్ల ఓజోన్ పొర దెబ్బతింటుందని, దానికి రంధ్రాలు ఏర్పడి వాటి ద్వారా అతినీలలోహిత కిరణాలు భూమిని చేరి, జీవుల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి చేయాలని వినతి

అగనంపూడి: అగనంపూడి ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఆస్పత్రి బయట హైవేను ఆనుకొని డ్రైనేజీ వ్యవస్థ శిథిలమైందని, రోగులు, వారి సహాయకులు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని వివరించారు.

గోశాల లేఅవుట్‌లో పందులతో రగడ



నివాసితులకు, పందుల పెంపకందారుకు వాగ్వాదం

సింహాచలం: గోశాల లేఅవుట్‌లో ఇటీవల పందుల బెడద ఎక్కువగా ఉండటంతో గోశాల నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు నివాసితులు ఫిర్యాదు చేయడంతో వాటిని షూట్ చేసేందుకు జీవీఎంసీ సిబ్బంది మంగళవారం వచ్చారు. విషయం తెలుసుకున్న పందుల పెంపకందారు అక్కడికి వచ్చి హడావుడి సృష్టించాడు. దీంతో స్థానిక నివాసితులు పెద్ద ఎత్తున ప్రతిఘటించారు. నివాసాల మధ్య పందుల్ని ఎలా వదిలేస్తారని, వాటివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పెంపకందారుని నిలదీశారు. ఇక మీదట ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. పందుల పెంపకందారు వెనక్కి తగ్గడంతో వివాదం సద్దుమణిగింది.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27లోగా ఐటీఐ.జీవోవీ.ఇన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు ఈనెల 28 హాజరు కావాలని పేర్కొన్నారు.

స్వీయ రక్షణపై విద్యార్థులకు అవగాహన



స్వీయ రక్షణ టెక్నిక్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

సబ్బవరం: సురక్షిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా విద్యార్థుల స్వీయ రక్షణ కోసం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సబ్బవరం సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అదేశాల మేరకు విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కరాటే ట్రైనర్ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు అత్యవసర సమయాల్లో తమను తాము కాపాడుకునేందుకు ఉపయోగపడే పద్ధతులు, సాధనాలపై పలు సూచనల ద్వారా వివరించారు. శక్తి యాప్, సైబర్ నేరాలు, డ్రగ్స్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడా, స్వీయ రక్షణ పద్ధతులు, మహిళలపై జరిగే నేరాలు, చట్టపరమైన రక్షణలను వివరించారు.

ముగిసిన హ్యాక్‌థాన్



విజేతలకు చెక్‌లు అందిస్తున్న ప్రిన్సిపాల్ అరుంధతి, అధ్యాపకులు

అగనంపూడి: కాపుజగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన హ్యాక్‌థాన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొదటి బహుమతిని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ద్వితీయ బహుమతిని నగరంలోని గాయత్రి కళాశాల, తృతీయ బహుమతిని విజయవాడ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలు దక్కించుకున్నాయి. వీరికి నగదు బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి మాట్లాడుతూ విద్యార్థులు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడిందన్నారు.

‘అప్పన్న ఆభరణాలపై అనుమానాలు నివృత్తి చేయాలి’

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి చెందిన బంగారు, వెండి ఆభరణాల పూర్తి వివరాలను వెల్లడించి, ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని సింహాచలం దేవస్థానం ఈవోను విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) కోరింది. ఈ మేరకు వీహెచ్‌పీ రాష్ట్ర అర్చక, పురోహిత మఠ మందిర్ టోలీ పూడిపెద్ది శర్మ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్వామివారి బంగారు, వెండి ఆభరణాల లెక్కల్లో తేడాలున్నాయంటూ ఇటీవల వస్తున్న ఆరోపణల్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్వామివారి భక్తులు, హిందూ ధార్మిక సంఘాల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి పత్రికాముఖంగా పూర్తి వివరాలను వెల్లడించి ఆలయ ప్రతిష్ట కాపాడాలని కోరారు.

ఇంజినీర్ల అర్హతలు వెల్లడించండి

సింహాచలం దేవస్థానంలో పనిచేస్తున్న ఇంజినీర్ల అర్హతలను బహిర్గతం చేయాలని ఈవోను వీహెచ్‌పీ ప్రతినిధులు కోరారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఈ, డీఈ, ఏఈల తొలి నియామకం ఏ పదవి, ప్రస్తుతం ఏ పదవిలో ఉన్నారు, వారి పదోన్నతులు ఏ అర్హతల మేరకు ఇచ్చారో వెల్లడించాలని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, నకళ్లతో సహా బయటపెట్టాలన్నారు. ఇటీవల దేవాలయంలో చోటుచేసుకున్న సంఘటనలతో ఇంజినీర్ల నైపుణ్యతలపై అనుమానాలు పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా ఒక ట్రస్ట్‌బోర్డు సభ్యుడు ఈ విషయంపై ఫిర్యాదు చేసినా దేవస్థానం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలని ఐద్వా ధర్నా



పరవాడలో ధర్నా చేస్తున్న ఐద్వా సంఘ ప్రతినిధులు

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కూడలిలో ప్రయాణికులకు అవసరమైన బస్ షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం పరవాడలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఏరియాలో నడుస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎక్కువగా బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారని, ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి, పోలీస్ స్టేషన్, జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, టిడ్కో కాలనీల ప్రజలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి బస్సుల కోసం ఆరుబయట నిరీక్షించాల్సి వస్తోందన్నారు. వెంటనే బస్ షెల్టర్ నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. ధర్నాలో ఐద్వా జిల్లా కార్యదర్శి మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, సీత, రాజకుమారి, సీతమ్మ, వరలక్ష్మి, సరోజిని, రమణమ్మ, సాయి, వెంకటి, రమ, తదితరులు పాల్గొన్నారు.